బ్రతికుండి మరణించిన అనుభవాన్ని పొందిన అతని అనుభూతి?

# అనుపిండి శ్రీనివాసరావు కథ

అబ్సర్డ్

నమస్కారం.


నేను వలివేటి నాగ వెంకట సూర్యనారాయణ అనబడే నేను— చచ్చి పోయాను. మామూలు చావుకూడా కాదు. ఆత్మహత్య చేసుకుని మరీ చచ్చిపోయాను.

మీకు నమ్మకం కలగటం లేదు కదూ!

నాతో రండి. మా ఇంటి దగ్గర దృశ్యం చూసేసరికి మీరే నమ్ముతారు. ఇన్నాళ్ళు శవాల మీద తెల్లబట్ట ఎందుకు కప్పుతారా అనుకునే వాడిని. కానీ, ఇపుడు తెల్సింది!... అబ్బ! ఆ శరీరం ఎంత భయంకరంగా ఉందని! కళ్ళు బయటికి పొడుచుకొచ్చేసి మెడ నరాలు ఉబ్బిపోయి... తలుచుకుంటనే ఒళ్ళు జుగుప్సతో జలదరిస్తోంది.. నా శరీరం— ఇన్నాళ్ళు నేనెంతో ప్రేమగా ఉన్నంతలో చక్కగా పరిరక్షించుకున్న నా శరీరం చూస్తేనే నాకు ఇలా ఉంటే... మరి బయట వాళ్ళ సంగతి, అందుకేనేమో ఈ బట్ట కప్పే ఆచారం!

నా శవం మీద పడి గుండెలవిసేలా, పేగులు తెగిపడేలా, శోషవచ్చేలా కన్నీరు మున్నీరుగా హృదయవిదారకంగా విలపిస్తోందే ఆ స్త్రీ మూర్తి— ఆమె మా అమ్మ. నామీద ఎన్ని ఆశలు పెట్టుకుందో! తొమ్మిది నెలల గర్భ భారాన్ని, ముప్ఫయి సంవత్సరాల మమతానుబంధాల్ని తలుచుకుని తలుచుకుని, కుమిలి కుమిలి పోతోంది!!

నోట్లో ధోవతి కుక్కుకుని, స్తంభాన్ని పట్టుకుని బాధనంతా బయటికి వెళ్ళగక్కలేక, దిగమింగలేక నానా యాతనలు పడుతున్నాడు నాన్న. బి.ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయిన కొడుకు చేతికి అంది వస్తాడని,



ముసలితనంలో ఆసరాగా ఉంటాడని భావించాడు. తలకొరివి పెడతాడని కలలుకన్న కొడుక్కి తలకొరివి పెట్టాల్సి వచ్చి, కలలన్నీ పగటికల్లలయ్యాయన్న పచ్చి నిజాన్ని జీర్ణం చేసుకోలేక సతమతమయి పోతున్నాడు.

మగాడు అన్నిటిలోను ఆడదానికన్నా పైసుంచే ఉండొచ్చుకానీ గుండెల్లోని బాధన

ంతా ఏడుస్తూ బయటికి వెళ్ళగక్కలేకపోవడం అన్న విషయంలో పూర్తి అస్వతంత్రుడు.

ఇంక చెల్లి... ఏడుస్తున్న అమ్మ నాన్నల్ని ఓదార్చాలో, తన పెళ్లి చేసి సుఖ పెడతాడను కున్న అన్నయ్య అన్యాయం చేశాడని ఏడవాలో తెలియక ముఖాన్ని మోకాళ్ళ మధ్య దాచుకుని ఒక మూల మవునంగా రోదిస్తోంది!

వరెవరో వస్తున్నారు!

ఏడ్చేవాళ్ళు ఏడుస్తున్నారు ఓదార్చే వాళ్ళు ఓదారుస్తున్నారు. వ్యాఖ్యానాలు చేసే వాళ్ళు నోటికొచ్చినట్లు వాగుతున్నారు. కొంత మంది ప్రేక్షకుల్లా 'చోద్యం' చూస్తున్నారు. కొందరిలో దుఃఖము, కొందరిలో బాధ, కొందరిలో విచారం, కొందరిలో విషాదం, మరి కొందరిలో యాంత్రిక భావం, ఇంకొందరిలో బాగా అయిందన్న 'ఇంటెర్నెల్ సాడిజం'....

''ఇంక జరగవల్సినవి చూడండి...''

వేలు విడిచిన బాబాయి అజమాయిషీ తీసుకుంటూ అన్నాడు. బాజా— అది చావు బాజా అయినా, పెళ్ళి బాజా అయినా— ఎక్కడుంటే అక్కడ ప్రత్యక్షమవడం, పెద్దరికం వహించి, తన పబ్బం గడుపుకోవడం ఆయన జీవనం! ఊర్లో ఏంజరిగినా, కుక్కలకే కదా హడావుడి!

ఆ మాటకోసమే చూస్తున్నట్టున్న కసాయి వాళ్ళు 'పల్లకి'లో నన్ను కట్టేసారు! అన్నీ సరిగా జరిగి, మంచి ఉద్యోగం వచ్చి వుంటే 'పెళ్ళి పల్లకి' ఎక్కవల్సిన వాడిని!!...

అప్పటివరకు ఉన్న ఏడుపులు ఆర్తనాదాలయి వాతావరణం మరింత దయనీయంగా మారింది. అమ్మ అయితే సొమ్మసిల్లి స్పృహ కోల్పోయింది.

''అక్క వచ్చేవరకు ఉంచొద్దా?...'' ఎవరో నెమ్మదిగా గొణిగారు.

అవును! ఇందాకట్నుంచీ గమనించనే లేదు. అక్కయ్యలేదు. టెలిగ్రామ్ అందుకుని రావాలి. అందునా పూర్తి కట్నం ఇవ్వలేదని సణుగుతున్న అత్తమామల్ని, భర్తని, ఆడపడుచుల్ని బ్రతిమాలి అనుమతి తీసుకుని మరీ రావాలి!!

''ఇప్పటికే ఆలస్యం అయింది... కానిచ్చేద్దాం!''

బాబాయి ఆజ్ఞ జారీ చేశాడు. 'ఊరేగింపు' బయల్దేరింది. ముందు నాన్న, వెనక పల్లకి, ఆ వెనక కొందరు మగాళ్ళు బయల్దేరారు. నేను కూడా వాళ్ళ వెనక 'నడక' సాగించాను... క్షమించాలి! నడవవల్సిన అవసరం నాకిప్పుడు లేదు. ఎంత దూరమయినా గాలిలో ఎగరగలను! శ్మశానం చేరాం...

అయిపోతోంది.... అయిపోతోంది... నా శరీరం కాలి బూడిద అయిపోతోంది. చిన్న గాయమయితేనే విలవిల్లాడే నా శరీరం కాలిపోతోంది! చిత్రంగా నాకే బాధాలేదు! నా శరీరం మంటల్లో కాలిపోతున్నా, కపాలం టప్ మంటూ రెండుగా పగిలిపోతున్నా, కాపరి శరీరాన్ని బలంగా నొక్కిపడుతున్నా నాకే బాధా కలగటంలేదు!!

అరగంటకి అందరూ శ్మశాన నిశ్శబ్దం నుంచి ఇంటి దారి పట్టారు! చివరగా నడవలేక నడవలేక నడుస్తున్న నాన్న, ఆ

ప్రక్కనే బాబాయి...

"ఈ పది రోజులకి... కనీసం ఐదు వేలయినా కావాలి..." బాబాయి నాన్న చెవిలో చిన్నగా గొణిగాడు!

అదిరిపడ్డాను.

నాన్నకి భారంగా అప్రయోజకుడిలా కూర్చోలేక ఇదంతా చేస్తే... మళ్లీ డబ్బు! డబ్బు!! డబ్బు!!!

వద్దు!

నా 'ఆత్మశాంతి'ంచక పోయినా పర్లేదు. వద్దు నాన్నా... వద్దు! అరిచాను!... కాదు, అరిచాననుకున్నాను! నా వెర్రికాని, నా మాటల్ని వాళ్ళిప్పుడు అందుకోగలరా??

"షా... వు...కా... రు..."

రుద్ధ కంఠంతో చెప్పలేక చెప్పలేక చెప్పి నడుస్తున్న చోటే కూలబడి పోయాడు నాన్న! అందరూ ఆగి నాన్నని లేవదీసి, ఓదార్చి నడిపించుకెళ్ళారు!

షావుకారు పేరు వినగానే నా బుర్ర

మళ్లీ క్షమించాలి! ఇపుడు ఇదీ నాకు లేదు! పని చెయ్యటం మానేసింది! అక్క పెళ్లికి, ఉన్న పూర్వీకుల పెంకుటింటిని తాకట్టుపెట్టి షావుకారు దగ్గర తెచ్చిన అప్పు— ఇప్పటికే పిల్లల్ని పెట్టి వికృత రూపంలో తాండవిస్తుండగా, మళ్లీ అప్పుకావాలంటే— 'గూటి'ని కృష్ణార్పణం అనుకో వల్సిందే!

మవునంగా శ్మశానంలోనే ఆగిపోయాను!

ఎంతసేపు గడిచిందో!

"హలో బ్రదర్!"


ఉలిక్కిపడి తలెత్తాను. నన్ను ఇపుడు గుర్తుపట్టి పలకరించే వాళ్ళెవరు?

"న్యూకమర్ వా?" ఎదురుగా 'నాలాగే' ఉన్న 'తను' నవ్వుతూ అడిగాడు.

"అవును!"

"ఏమిటి కథ?"

అతను నాకంటికి చాలా ఆత్మీయుడిగా కనిపించాడు! ఎడారిలో ఒయాసిస్సు ఎవరిక



యినా ఆత్మీయంగానే కనపడుతుంది కదా!

"చాలా ఓల్డ్ స్టోరీ!" అంతా విన్నాక పెదవి విరుస్తూ అన్నాడు. నిజం చెప్పొద్దూ, నాకు కొద్దిగా కోపం వచ్చింది. జాలి చూపించడం మానేసి, హేళన చేస్తున్నాడు!

"నీ కథేమిటో?" వెటకారంగా అడిగాను.

"ట్రెండ్ సెట్టర్... నన్ను గుర్తుపట్టలేదా? అఖిల భారత నట కీచక భీమారావు ఫాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌ని!"

"అయితే, ఎలా చచ్చిపోయావు?"

"ఏముంది? ఆ అప్పారావు ఫాన్స్ అసోసియేషన్‌తో చిన్న గొడవొచ్చి ఆ ప్రెసిడెంట్‌ని నేను, ఆ ప్రెసిడెంట్ నన్ను పొడిచేసుకున్నాం!.. చచ్చాక మాత్రం మేమిద్దరమూ మంచి ఫ్రెండ్స్ అయిపోయామనుకో! నవ్వుతూ చెప్పాడు.

నీకిలా చెప్పుకోవటానికి సిగ్గు వెయ్యటం లేదూ? కోపంగా ప్రశ్నించాను!

"సిగ్గా!? ఎందుకు? మరింత నవ్వుతూ ప్రశ్నించాడు.

"ఒక నటుడి పట్ల అభిమానం ఉండటం మంచిదే! కానీ అది దురభిమానమయి మరో నటుడి పట్ల ద్వేషంగా మారి ఆ నటుడి అభిమానులతో గొడవపడటం ఆ గొడవని హత్యల వరకు తీసుకెళ్ళడం... నిజంగా ఎంతటి దౌర్భాగ్య పరిస్థితి! ప్రతీ ఒక్కరూ తల వంచుకోవాల్సిన విషయమిది! ఆ హీరోలు ఎలా ఊరుకుంటున్నారో..." ఆవేశంతో వగురుస్తూ అన్నాను.

"బాగుంది!" అతను నవ్వుతూనే అన్నాడు.

"ఏమిటి?"

"నీ స్పీచ్!"

నేను కోపంగా ఏదో అనబోయాను. కాని అతను ఆ మధ్యలోనే అందుకున్నాడు.

"హు... స్పీచా? నిజాలు అలాగే అనిపిస్తాయి" అంటూ ఓల్డ్ డైలాగ్ ఒకటి చెప్పకు!... నువ్వు చెప్పేది 'నిజాలే'!! నేను కాదనటం లేదు. కానీ ఈ నిజాన్ని ఆ రోజుల్లో ఆనాటి 'ఆవేశం'లో తెలుసుకోలేక పోయాను. అది నేను చేసిన తప్పు! ఆ తప్పుకి నేననుభవిస్తున్న శిక్ష అంటూ ఆగి తన వంక ఒకసారి చూసుకుని "ఈ రూపం!" అంటూ పూర్తి చేశాడతను.

నేనేం మాట్లాడలేదు అనేకన్నా ఏం మాట్లాడాలో తెలియలేదు అంటేనే 'నిజాయితీ'గా ఉంటుంది!

"ఈ ప్రపంచంలో అతి తేలికయిన విషయమేమిటంటే- ఎదుటి వాడిలోని తప్పులని గుర్తించడం, అత్యంత కష్టమయిన విషయమేమిటంటే— మనలోని 'తప్పు'లని మనమే గుర్తించగలగడం!.. నా సంగతి సరే! నువ్వు చేసిన పనేమిటి?" అతను అదే నవ్వుతో అడిగాడు.

"దేని గురించి నువ్వడిగేది?" కంగారుగా అడిగాను.

"నటించకు, బ్రదర్! నటన 'మనుష్యుల' జన్మహక్కు. మనక్కాదు!!"

"ఏం చెయ్యమంటావు? ఉద్యోగమా రాదు.. బి.ఎ హై ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యి అటెండర్ ఉద్యోగానికెళ్ళినా, అక్కడా ఎమ్.

.ఏ. హై ఫస్ట్ క్లాస్‌లు తయారవుతున్నారు... అందుకే, కన్న తల్లి దండ్రులకి భారంగా కూర్చోలేక... ఆత్మహత్య చేసుకన్నాను!'' 'తలవంచుకుని' నిజం చెప్పేశాను.

''ఉద్యోగమే జీవిత మంటావు!... డిస్టింక్షన్‌తో డిగ్రీలు పాసయ్యి రిక్షాలు తొక్కుకుంటూ ఎంత మంది బ్రతకటంలేదు? సివిల్ ఇంజనీర్స్ 'ముష్టి ఎత్తుకుని' నిరసన ప్రదర్శనలు చేసే వ్యవస్థ మనది!! ఆ వ్యవస్థలో బ్రతకలేకపోవడం నీ తప్పేకానీ ఆ వ్యవస్థది కాదు!! చేతనయితే ఆ వ్యవస్థని మార్చాల్సింది కాకపోతే తలవంచుకుని అందులో సరిపెట్టుకుని బ్రతకాలి!.. అలాకాకుండా నిండుప్రాణాల్ని బలి చేసుకోవడం నీ తప్పు కాదా?'' అతను సూటిగా ప్రశ్నించాడు.

అతని మాటలకి నా దగ్గర సరిఅయిన సమాధానమున్నట్లు నాకనిపించలేదు!

''అంతేనంటావా?'' బేలగా అడిగాను.

''కంగారు పడకు!... పద. అలా వెళ్లి మన ఫ్రెండ్స్‌ని కలుద్దాం!''

''ఫ్రెండ్స్?'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఎందుకంత ఆశ్చర్యం! నువ్వు ఒక్కడివే ఆత్మహత్య చేసుకున్నాననుకుంటున్నావా ... బి.సి నాటి నుంచి ఉన్న 'అన్సర్' బ్రదర్—ఇది!'' అతను నవ్వుతూ అన్నాడు.

''అన్నట్టు అడగటం మరిచా— నీ పేరేమిటి?''

''న్యాకమర్‌నని మరోసారి ప్రూవ్ చేసుకున్నావు. అన్ని బంధనాల్ని తెంచుకున్న వాళ్ళం. మరకింకా పేర్లేమిటి బ్రదర్?''

''నిజమే...'' నసిగాను.

''పద!''

మవునంగా అతని కూడా 'నడవ' సాగాను.

కొంత దూరం పోయాక, ''అదిగో! ఆమె దగ్గర కెళ్దాం, పద!!'' అన్నాడతను.

ఆమె వైపు చూశాను. శోక దేవతలావుంది!

''ఎందుకంత బాధ?'' ప్రశ్నించాను.

అతనేం బదులు చెప్పలేదు.

''హలో!...'' నవ్వుతూ ఆమెని పలకరించాడు.

ఆమె మమ్మల్ని చూడగానే 'కళ్ళు' తుడుచుకుని, ''నువ్వా? ఇతనెవరు?'' అని



## 'ఎ' సినిమా

''ఇది 'ఎ' సర్టిఫికెట్ సినిమా పిల్లలు చూడకూడదు. పెద్దలే చూడాలి'' అన్నాడు అప్పారావు 12 ఏళ్ళ శీనుతో.

''నాకు తెలుసండీ... కానీ నేను పెద్దయ్యే వరకూ ఈ సినిమా ఆడుతుందో లేదో... ఆడినా ముఖ్యమయిన సీన్లన్నీ కట్ అయిపోతాయి కదా... అందుకే ఇప్పుడే చూస్తున్నా'' చెప్పాడు శీను.

కొండల అక్కారావు (విశాఖపట్నం)

అడిగింది.

నా గురించి చెప్పాడు. "నీ గురించి నువ్వే చెప్పుకుంటే బాగుంటుందేమో?" అన్నాడు.

ఆమె విరక్తిగా నవ్వింది!

"హు! ఏం చెప్పమంటావు?... పనిలేని తెలుగు రచయిత్రుల నవలల్ని చదివేసి, నా అందం చూసి ఆరడుగుల ఇంపాలా అందగాడు వచ్చి నన్ను పెళ్ళి ఆడేస్తానని చెప్పేసరికి నమ్మి మోసపోయానని చెప్పనా? వాడు మరో అమ్మాయితో తిరుగుతూండగా చూసాక కూడా, వాడు "ఆమె నా కజిన్ సిస్టర్" అని చెపితే నమ్మినందుకు శిక్ష అనుభవిస్తున్నానని చెప్పనా? నన్ను నమ్మతే వా ప్రియా" అంటూ వాడు నాలుగు డైలాగులు చెప్పి మంచంమీదకి లాగితే, 'మైకం'లో వెళ్ళిపోయానని చెప్పనా? ఆ 'మైకం' ఒకసారి తర్వాత కూడా వదుల్చుకోలేక కడుపు తెచ్చుకున్నానని చెప్పనా? కడుపు వచ్చిన తర్వాత, వాడు ఛీకొట్టిన తర్వాత; ఎబార్షన్ అన్న ఆలోచనే లేకుండా ఈ 'తప్పు' చేశానని చెప్పనా?... ఏం చెప్పమంటావు?"

ఆమె చాలా బాధతో ఉందని గ్రహించాను!

"ఊరుకోండి! జరిగిపోయిందేదో జరిగిపోయింది. పాస్ట్ ఈజ్ పాస్ట్..." అంటూ సముదాయించబోయాను.

నా మాటల్లో ఏముందో కానీ, నా మాటలకి వాళ్ళిద్దరూ పగలబడి, విరగబడి నవ్వసాగారు.

"ఎందుకలా నవ్వుతున్నారు?"

చాలాసేపటి వరకు వాళ్ళిద్దరూ నవ్వుతూనే ఉన్నారు. మొదట్లో అతనే తేరుకున్నాడు.

"న్యూకమర్‌వని మరోసారి రుజువు చేసుకున్నావు... ఏమిటన్నావు? పాస్ట్ ఈజ్ పాస్ట్ యా?... హ్హ హ్హ హ్హ..." అతను మళ్లీ నవ్వసాగాడు.

"అవును! అందులో తప్పేముంది?" ఉక్రోషంగా ప్రశ్నించాను.

"ఆ డైలాగ్ ఎప్పుడు చెప్పాలంటే. ప్రెజంట్ ఫ్యూచర్ ఉన్నప్పుడు! మనకారెండూ లేవు! ఉన్నదల్లా 'పాస్టే'?

"అంటే?..."

"మనం ఏమాత్రం సరిదిద్దుకోలేని తప్పు చేశాం!" ఈసారి ఆమె చెప్పింది!

"మేబీ! బట్... దానిని గుర్తు చేసుకోవడం..." ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలియక ఆగాను.

"నీ ఉద్దేశ్యం నాకర్థమయింది! ఈమె చేసిన 'తప్పు'కి 'శిక్ష' ఈమె ఒక్కతే అనుభవిస్తోందనుకున్నావా? కాదు! మైకంలో కడుపు తెచ్చుకుని, ఆవేశంలో చచ్చిపోయిన కూతురి పనికి అమ్మలక్కలకి ఎక్స్‌ప్లెనేషన్ ఇవ్వలేక— ఈమె తల్లి పిచ్చిదయింది! అక్క చరిత్ర తెల్సిన వాళ్లెవరూ ముందుకురాక, పెళ్లికాక చెల్లి వ్యభిచారం చేస్తోంది! తమ్ముడు జులాయి అయ్యి. చిన్నక్కకి బ్రోకర్ అయ్యాడు! తండ్రి దేవదాసులా మందుకి బానిస అయ్యాడు! వీళ్ళందరూ మనలా తప్పు చెయ్యలేక బతకలేక జీవచ్చవాల్లా... ఈమెని ప్రతీ రోజూ తిట్టుకుంటూ బతుకుతున్నారు! అది చూసి... ఈమె

ఇలా..."

అతని మాటలు నాకు అర్థంకావటానికి చాలా టైమ్ పట్టింది!

"నా గొడవ ఒక్కటే చాలదు కదా!... ఇతన్ని మనోళ్ళందర్కీ పరిచయం చెయ్యి!" ఆమె అంది. మేమిద్దరమూ ఆమె దగ్గర సెలవు తీసుకుని వచ్చేశాం!

మళ్ళీ మవునంగా నడుస్తున్నాం! నాలో ఆలోచనలు...జోరీగల్లా.. రేపు... మా అమ్మ, నాన్న, చెల్లి, అక్క... నా తప్పుకి శిక్ష అనుభవించాలా?

"హలో ఫ్రెండ్స్!"

తలెత్తి చూశాను. మాలాంటి మరొకతను ఇతను నా గురించి, నా తప్పుని చెపుతూ చెప్పాడు!

"మీ సంగతేమిటి?" నేనే అడిగేశాను.

"అది వీడినే అడగండి... నాకు పనుంది" అంటూ అతను వెళ్ళిపోయాడు.

"ఏమిటి! వాటే జోక్..." నా ప్రక్కన తను గట్టిగా నవ్వాడు. నాకూ చిన్నగా నవ్వొచ్చింది.

"ఏమాకథ?" నాటిక ఫక్కీలో అడిగాను.

"ఇందాక ఆమె కథకి జస్ట్ ఆపోజిట్! బుద్ధిగా మెడిసెన్ చదువుకోకుండా వాళ్ళింటి ప్రక్కనున్న 'ఆంటీ'ని లవ్ చేశాడు! ఆ లవ్ పాకానపడి ఓ నైట్ వేడెక్కిపోయి, మనిద్దరమూ బెడ్‌మీద లవ్ చేసుకుందామా అని అడిగాడు. ఆమె-ఇద్దరు పిల్లల తల్లి పాపం, వీడి దురాలోచనకి ఆశ్చర్యపోయి కాదు అంది! హు నేనంతగా లవ్‌చేసి బెడ్‌మీద దాన్ని డెవలప్ చేద్దామంటే కాదంటుందా అని ఆవేశపడి పోయి, నిర్లిప్తతతో ఈ 'తప్పు' చేశాడు!"

నా కర్థమయింది. అతను 'తప్పు' వెర్షన్‌లోనే చెప్పాడు. అదే-అసలయిన ఆ వ్యక్తి అయితే ఆ ఆంటీని తానెంతగా ఆరాధించిందీ, ఆమె కూడా ఎలా పాజిటివ్‌గా రియాక్ట్ అయిందీ, చివర్లో ఎలా కాదండీ చెప్పి దానిని తన సున్నిత హృదయము తట్టుకోలేక ఇలా చేసానని చెప్పి ఉండేవాడు!



## డిస్క్ కెమేరా

కంప్యూటర్లలో ఎంతో సమాచారాన్ని నిల్వ ఉంచినట్లే ఫొటోల్ని కూడా స్టోర్ చేయగల డిజిటల్ కెమెరాను తోషిబా, ఫ్యూజీకంపెనీలు సంయుక్తంగా జపాన్‌లో మొదటిసారిగా అమ్మటం మొదలుపెట్టాయి. ఈ కెమెరా సహాయంతో తీసిన ఫొటోలను కంప్యూటర్ డిస్క్‌లాటి మాగ్నటిక్ డిస్క్‌లో స్టోర్‌చేసి కావాలనుకొన్నప్పుడు టెలివిజన్ ద్వారా చూడవచ్చు.వీటి నుంచి మామూలుగానే ప్రింట్స్ కూడా తీసికోవచ్చు. ప్రతి డిస్క్‌లోనూ 50 ఫొటోల్ని తీయటానికి ప్రస్తుతానికి వీలుపడుతుంది.

—జూపిటర్

"ఆమె దగ్గర కెళ్దామా?" ఒంటరిగా ఒక పెగ్గుమీదున్న స్త్రీని చూపించి అడిగా డు.

"అక్కర్లేదు! ఆమె స్టోరీ కూడా నువ్వే చెప్పు!"

"నిజానికి ఆమెది కొద్దిగా జాలి కథ! కోరుకున్న వాడిని పెళ్ళి చేసుకుని ఒక పిల్లవాడిని కని చాలా సుఖంగా గడిపింది! ఆమె భర్తకి ఎలా స్టార్ట్ అయిందో సెవన్ ఇయర్స్ ఇచ్ దానితోపాటే ముందు... అన్నీ మొదలయ్యాయి! ఆటోమేటిక్‌గా ఆమె మీద అనుమానం... చాలా కాలం దానికి తట్టుకునే ప్రయత్నం చేసి, ఓడిపోయిం ది!"

పైకి ఆమె తప్పు కనపడకపోయినా, ఆమెలోనూ లోపముంది! ఇంట్లో భోజనముం డగా హోటల్ కెళ్ళాల్సిన అవసరము ఆ భర్తకి వచ్చిందంటే రెండు చేతులు కలిస్తేనే కదా చప్పట్లు. పిల్లాడి గురించి ఒక్క క్షణం ఆలోచించి ఉంటే, ఆమె 'ఇలా' చేసేది కాదు.

"నాకు ఈ కథలు చాలు. విసుగు పుడ్తోంది!" ఆలోచనలతో వేడెక్కిన చిరాకు తో చెప్పాను.

"ఇవ్వాళ్టికి చాలు!... రేపు కలుద్దాం!..."

అతను వెళ్ళిపోయాడు. నేను ఒంటరిగా మిగిలిపోయాను. ఒంటరి తనం! దాన్ని సద్వినియోగం చేసుకోగలిగితే ఎంతటి వర మో! దుర్వినియోగపరుచుకుంటే అంతటి శాపం!! డిగ్రీ అయిన దగ్గర్నుంచీ ఒంటరిత నమే! నాన్న బడిపంతులుద్యోగంలో ఇద్దర్ని నెట్టుకురాలేక పడే అవస్థలు చూసి రక్తం సలసలా కాగిపోతున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయ ఒంటరితనం!

"ఎవర్నువ్వు?" ఎవరో ముసలాయన నాకేసి చూస్తూ అడిగాడు.

నా గురించి చెప్పాను.

"నీలాంటి వాళ్ళని ఎంత మందిని చూశానో!" ఆయన కొద్దిగా జాలిగానే అన్నాడు.

"ఉద్యోగం రాక, ప్రేమల్లో ఓడిపోయి, బాధ్యతలకు భయపడి, కష్టాలకి తట్టుకోలేక, ఎవరికి పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనో ఆత్మహత్యలు చేసుకోవడం ఒక 'ఫ్యాషన్' అయిపోయింది! అసలు నన్ను అడిగితే ఈ 'ఫ్యాషన్' అనేది ఒక అంటురోగం లాంటిది ... ఒక్కడితోనో, ఒక ప్రాంతంతోనో ఆగదు!!..."

నాకు కొద్దిగా భయమేసింది. నేను కల్పించుకోకపోతే ఆయన 'అలా' చెప్పుకుపో యేలా ఉన్నాడు.

"మరి మీ కథ చెప్పనే లేదు " అన్నాను.

"నా కథ..." పేలవంగా నవ్వాడాయన.

"నా మంచితనమే నా ఈ స్థితికి కారణం!... ఒకప్పుడు 'కరోర్‌పతి'ని. రెండు ఫాక్టరీలకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మాంఛి పొజీషన్‌లో ఉండే వాడిని! నేను మంచి వాడిని. అందులో ఏం సందేహంలేదు.. ... బట్, ఐ ఎక్స్‌పెక్ట్ ఈచ్ అండ్ ఎవ్విరి వన్ టు బి గుడ్!! దటీజ్ వెరీ వెరీ బాడ్... నా వెనక్కాల నేను నమ్మిన వాళ్ళే గోతులు తవ్వి నన్ను నడిరోడ్ మీద నిలబెట్టారు... జీవితాంతం నాతో సహచర్యం చేస్తానని వాగ్దానం చేసిన నా భార్య నన్ను వదిలేసింది!

రెక్కలొచ్చిన కొడుకు ఎగిరిపోయాడు... మరో గత్యంతరం లేక ఈ మార్గాన్ని ఎన్నుకున్నాను!...''

నిజమే. పువ్వులమ్మిన చోట కట్టెలమ్మడం కష్టమే! కానీ, అసాధ్యం మాత్రం కాదు!! పరిస్థితులకి తలవగ్గి, పరిస్థితిలని మనకనుకూలంగా మార్చుకోగలగడంలోనే మన ప్రత్యేకత చూపాలి. ఎల్లకాలం కట్టెలే అమ్మాలని ఏముంది? కొన్నాళ్ళ తర్వాత కృషితో పువ్వులమ్మగలిగే స్థానానికి చేరగలమేమో!...

నా ఆలోచనల్ని గమనించినట్లుగా ఆయన చెప్పటం కొనసాగించాడు. ''నిజమే! ఈ ఆలోచన అప్పుడు రాలేదు... ఆవేశం ఆలోచనని చంపేస్తుంది! ఆత్మహత్య చేసుకోవడానికి ఒక్కరోజు కనీసం ఒక్క గంట అయినా వాయిదా వేసి వేసి వుంటే... సర్లే! జరిగి పోయిన తర్వాత ఇపుడివన్నీ ఎందుకు?''

అప్పుడప్పుడు... నసుగుతూ అన్నాను.


''ఏమిటప్పుడు?... నేను చచ్చి సాధించింది ఏమిటి? లోకం కోసం, నేను 'నా' అనుకున్న వాళ్ళు నాలుగు రోజులు ఏడ్చారు. ఆ తర్వాత మామూలే! ఎవరి పనుల్లో వాళ్ళు... కనీసం ఏడాదికొకసారి వచ్చేనా ఆబ్దికం కూడా ఎవ్వరికీ గుర్తుండటంలేదు. అందరూ హాయిగా ఉన్నారు. కానీ నేను మాత్రం బలవంతపు చావు చచ్చి, తీరని కోరికంతో అటూ ఇటూ కాకుండా ఇలా ఏడుస్తున్నాను!...'' ఆవేదన ఆవేశమవగా ఆయన కోపంగా అన్నాడు.

నేను ఏం మాట్లాడితే ఏం తప్పో అని మౌనంగా ఉండిపోయాను.

''అలా వెళ్దాం. పద!''

ఎదురు చెప్పకుండా అనుసరించాను!

ఆశ్చర్యం! అక్కడ... అక్కడ.... అందరూ నాలాటి వాళ్ళే! కానీ, అందరూ బాధగా, అన్ని కోల్పోయిన వాళ్ళలా గాలిలా నిశ్చలంగా ఉన్నారు. అంతమంది ఉన్నారన్న మాటేగాని అక్కడ నిశ్శబ్దం రాజ్యం చేస్తోం



ది!!

"ఎవరితోనయినా 'మాట్లాడతావా?''

నేను ఏం సమాధానం చెప్పలేదు. ఎవరితోను మాట్లాడాలనిపించటం లేదు! మాట్లాడాక వాళ్ళు చెప్పే కథలు వినే ధైర్యమెంత మాత్రము నాలోలేదు...

నేను తప్పు చేశానా?

అసలు మరణం అంటే ఏమిటి?

మనం తప్ప మొత్తం ప్రపంచం అంతా జీవించి ఉండటం!!

రేపు... నామూలంగా రోడ్లపాలయితే అమ్మా, నాన్నా నన్ను క్షమించగలరా?

కని పెంచినందుకు వాళ్లకి నేనిచ్చిన ప్రతిఫలమేమిటి?

బతికున్నంత కాలం వాళ్ళు కుమిలి కుమిలిపోయేలా చేశాను!

పోనీ, నేనయినా సుఖ నిద్ర పోతున్నానా అంటే అదీ లేదు!!

ఏమిటిది?

ఏమిటిలా అయింది?

అలా చేస్తున్నప్పుడే ఇలా అవుతుందేమో నని ఆలోచించలేకపోవడమే నేను చేసిన తప్పా?

అతనన్నట్టు —ఉద్యోగమే జీవితం కాదు. కదా!

స్వయం శక్తితో తెలివితేటల్ని ఫణంగా పెట్టి జీవితంలో ఎంతోఎత్తుకు ఎదిగిపోయిన వాళ్లొందరు లేరు?

ఫాల్స్ ప్రెస్టేజీకి పోకుండా రిక్షా తొక్కుకున్నా ఇలా జరగపోవును. రోజుకి కనీసం ఆరు బేరాలు తగిలినా, ముప్పయి రూపాయలు! నాన్నకి రోజుకి వచ్చే నలభై రూపాయిలకి కలిపితే డెభ్బై... రోజుకి ఇరవై రూపాయలు తిండికిపోయినా యాభై మిగులు... నెలకి పదిహేను వందలు... ఏడాదికి పద్దెనిమిది వేలు...

ప...ద్దె...ని...మి...ది...వే...లు!!

నేను తప్పు చేశాను!

అనవసరంగా చచ్చిపోయాను!!

బట్, నాకిపుడు బ్రతకాలనుంది!!!

అవును, నాకు బ్రతకాలనుంది...

నాకు బ్రతకాలనుంది...

నాకూ బ్రతకాలనుంది...

కానీ, ఎలా? ఎలా? ఎలా???

నాకు తెలియకుండానే నా కళ్ళవెంట నీరు ధారగా కారుతోంది!

చిటపట చినుకులతో ప్రారంభమయిన వాన కుండపోతగా మారినట్లు, ఏడుపు ఉధృతమై బోరున ఏడవసాగాను!!

ఎంతసేపు అలాగడిచిందో...

"చీకట్లో ఏం చేస్తున్నావురా?''

ఆ మాటలకి ఉలిక్కిపడ్డాను. ఎదురుగా అమ్మ! ఎక్కడ ఉన్నానో గుర్తు రావడానికి కొద్దిసేపు పట్టింది!

"ఆ కన్నీళ్ళు ఏమిట్రా? ఏమైందిరా, బాబూ!'' అమ్మ కంగారుగా నా దగ్గరికి వచ్చి తన చీర చెంగుతో కన్నీళ్ళని తుడిచింది"

"అదీ... ఇందాక కళ్ళలో ఇసుక పడింది"

"అందుకే రోడ్‌మీద ఊరికే తిరగకురా అంటే వినవుకదా!! ఏ క్షణాన ఏం జరుగుతుందో... నువ్వు బయటికి వెళ్ళిన తర్వాత,

మళ్లీ వచ్చేవరకు నాకు స్థిమితంగానే ఉండదు ...''

అమ్మ ఏదో చెప్పుతోంది!

ఇటువంటి అమ్మని తన మానాన వదిలేసి— నేను పిరికివాడిలా పారిపోదామను కున్నది!

''నాన్నగారు రాలేదా?...''

''లేదురా... ఇవాళ్టి నుంచి కొద్దిగా లేట్‌గా వస్తానన్నారు!...''

''ఎందుకు?''

''అదీ... షావుకారుకి లెక్కలు చూసే వాళ్లు ఎవరూ లేరుట... స్కూల్ అయ్యాక ఖాళీయే కదా అని ఈయన చూస్తానన్నారు ట!''

ఇటువంటి తండ్రినా— నేను నట్టేట ముంచేసి నా దారిన నేను పోదామనుకున్నది!

''భోజనం పెడతాను... పద! ఇప్పటికే పొద్దుపోయింది...''

''పెట్టెయ్యి...''

అంటూ పెరట్లోకి కాళ్ళు కడుక్కోవ డానికి దారితీసారు.

అప్పటికే చుట్టూ చీకట్లు అలుముకుం టున్నాయి!

నాకు మాత్రం అన్నీ స్పష్టంగా కనపడు తున్నాయి!!

ఎందుకంటే 'చీకట్లోంచి' వెలుగులోకి రావలనుకున్నాను కదా!

నేను బ్రతుకుతాను. ఆత్మవిశ్వాసమే ఊపిరిగా, స్వయం కృషే ఆయుధంగా, ఆత్మబలమనే సహచరుడితో ఈ 'జీవితం' తో పోరాడతాను!!



### లేచిపోయింది

''సార్... సార్ మళ్ళీ కొంప మునిగింది సార్''
పరిగెట్టుకుంటూ వచ్చాడు మంత్రిగారి పిఎ.
''మళ్ళీ ఏవమయింది'' మత్తులో అడిగాడు మంత్రి.
''మీ మూడో భార్యకూడా లేచిపోయింది సార్.
పోతూ పోతూ ' మీ అయ్యగార్ని మరో పెళ్ళి చేసుకో వద్దను, చేసుకున్న వాళ్ళంతా లేచిపోలేక ఛస్తున్నారని'' చెప్పమన్నారండి'' అన్నాడు పిఎ.

యం.సత్యనారాయణ (ఇంకొల్లు)